

“నా హృదయంలో నివసించే చెలీ ... కనులతోనే కవ్వించే సఖీ . . .” అంటూ శ్యామలను ఓరగా చూస్తూ పాడసాగాడు నవీన్.

శ్యామలకు అరికాలి మంట నెత్తికెక్కింది. ‘ఎంత పొగరు! ఇలాటి వేషాలకేమి తక్కువలేదు ... హీరోలా వీడి పోజూ . . . వీడూ . . .’ అనుకుంటూ చంద్రతో, “రావే . . . పోదాము ఇక్కడినుంచి” అంటూ చేయిపట్టుకొని లాగింది చంద్ర “ఊఁ” అంటూ మళ్ళీ తలవంచుకొని ఏవో లెక్కలు చేసు కుంటూఉంది. శ్యామలకు చిరాకు ఎక్కువైంది. ఒకసారి నవీన్‌వైపు గుడ్లురిమి చూచి, పైట సర్దు కొని అక్కడినుంచి పోబోయింది. అంతలో “పయన మయే ప్రియతమా . . . నను మరచిపోకుమా . . . ఓ ప్రియతమా . . . ఆ . . . ఆ . . .” అంటూ అందుకున్నాడు. అక్కడున్న చుట్టుపక్కలవాళ్ళంతా వెకిలిగా నవ్వసాగారు.

చంద్ర పుస్తకాలు సర్దుకొని లేవబోయి, పాట వింటూ ఆశ్చర్యంగా నవీన్‌వైపు చూచింది. శ్యామల ఆగిపోయి, నవీన్‌ను చురచురా చూచింది. చంద్ర మెల్లగా అన్నది శ్యామలతో: “అబ్బ! నవీన్‌కు పాట కూడా వచ్చునే . . . అచ్చం పి. బి. శ్రీనివాస్ గొంతు కలా ఉంది కదూ!”

శ్యామలకు ఒళ్ళు మండిపోయింది. “ఔను. అతను శ్రీనివాస్ . . . నువ్వేమో జానకి . . . ఇంకేం, డ్యూయట్లు ఆరంభించండి.” రుసరుసలాడింది. చంద్ర మొహం నయాపైసా అంత అయింది. మళ్ళీ చతికిలబడింది. శ్యామలతో, “ఏమే, ఆ ఫిజిక్స్‌లో ప్రాబ్లము ఎంత చేసినా రాలేదే .. నువ్వొకసారి చేసి చూడరాదూ?” అంది.

శ్యామల తారాజువ్వలా లేచింది. “ఏమే, నువ్వు వస్తావా? ... లేకపోతే నేను వెళ్ళిపోనా?” అన్నది.

చంద్ర అమాయికంగా చూచి “ఏమిటో ఏ గొడవ!” అంది.

శ్యామల ఉస్సురుమంటూ నిట్టూర్చింది “నీకు కూడా మతిపోలేదు కదా .. ఇందాకటినుంచి రమ్మంటూంటే మళ్ళీ ఏమిటని అడుగుతావు?” అంటూ చంద్ర రెక్క పట్టుకొని లేపింది. ఇద్దరూ లైబ్రరీనుండి వెలుపలికి వచ్చి లేడీస్ రూమ్‌వైపు దారితీశారు.

నవీన్ వారిని అనుసరించాడు.

శ్యామల వెనుదిరిగింది. నవీన్ ఏమీ ఎరుగనట్లు ఈలవేస్తూ ఎటో చూడసాగాడు.

భర్త అనురాగంపొంది సుఖిస్తుంది స్త్రీ. భార్య సుఖంకోసం భర్త కొన్ని నిర్ణయాలు, త్యాగాలు చేస్తాడు.. ఆ నిర్ణయాలు ఆమెకు సుఖాలనిస్తాయో, దుఃఖాలనే కలుగజేస్తాయో ఊహించడు. ఫలితంగా, జీవితంలో అనేక మార్పులు రాకతప్పదు. ఆ మార్పులు అందరినీ సుఖడోలికలలో ఊగిస్తాయని చెప్పలేం .... కొందరికి ఆ మార్పులే ప్రాణాంతకంగా పరిణమించవచ్చు.

"చంద్రా . . . నువ్వెళ్తూ ఉండు . . . నేనిప్పుడే వస్తా" అంటూ వెనక్కి తిరిగి, "ఏయ్ . . . మిస్టర్ రాగం . . ." అని పిలిచింది.

నవీన్ తాపీగా శ్యామలవైపు చూచి, "మీరు నన్నేనా పిలిచింది?" అన్నాడు.

"ఆహా . . . మిమ్మల్నే . . . ఎన్ని రోజులనుండి మీకీ వ్యాధి . . . ఏదయినా డాక్టరుకు . . ." అర్ధోక్తిలో నిలిపింది.

నవీన్ ఆశ్చర్యంతో అభినయిస్తూ, "నాకు వ్యాధా? అబ్బే, మీరు పొరబడుతున్నారు . . . మొన్ననే మెడికల్ చెకప్‌కుకూడా వెళ్ళాను. పూర్తి ఆరోగ్య సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. అయినా . . . మీకు నామీద ఉండే అక్కరకు చాలా థాంక్స్" అన్నాడు చిలిపిగా.

"నాన్సెన్స్ . . . లైబ్రరీలో చేసిన గొడవ చాలకుండా ఏమిటి ఇంకా వాగుతున్నారు . . . ఇప్పుడే ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేస్తాను."

నవీన్ కనుబొమలు ముడివేసి, "అలాగా ... ఏమని ఇస్తారండీ? నేను పాడాననా ... లేక మీవెంట వస్తున్నాననా ... ఏమండీ, శ్యామలాదేవిగారూ, ఈ లైబ్రరీ మీ సొమ్మనుకున్నారా . . . నా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాను . . . పాపం! నా పాటలకు మిమ్మల్ని అన్వయించుకున్నారన్నమాట. నిజంగా చాలా చాలా విచారించదగ్గ విషయమే!"

శ్యామల మొహం అతని మాటలకు అవమానంతో ఎర్రబడింది. పళ్ళు పటపట కొరుకుతూ వెళ్ళిపోయింది. వెనకనుండి నవీన్ నవ్వడం వినిపించకపోలేదు శ్యామలకు.

నవీన్‌కు సుమారు 25 సంవత్సరాల వయస్సు ఉంటుంది. చాలా అందంగా ఉంటాడు ... చదువులో కూడా చాలా చురుకైనవాడు. ఎప్పుడూ అల్లరిచేస్తూ తిరుగుతూంటాడు. కాని సహజంగా తెలివైనవా డవటం చేత పరీక్షలముందు శ్రద్ధగా చదివి ఫస్టు మార్కులు తెచ్చుకునేవాడు. లెక్చరర్లందరికీ నవీన్ అంటే తగని అభిమానం.

నవీన్‌కు చిన్నప్పుడే తలిదండ్రులు దూరమయ్యారు. అతన్ని తాతగారే పెంచారు. నవీన్ ఎస్. ఎస్. ఎల్. సి. చదివేటప్పుడు ఆ తాతగారుకూడా గతించారు. ఎన్నో కష్టాలు పడి వారాలు చేసి స్కూలుఫైనలు పాసయ్యాడు. అతనికి పెద్దపెద్ద చదువులు చదవాలని ఎంతో అభిలాష ... కాని చదువుకోవాలంటే డబ్బు కావాలిగా. అసలు భుక్తికే కష్టంగా ఉంటే, కాలేజీ ఫీజు కెలాగా? చివరికి గత్యంతరంలేక ఒక ఫ్యాక్టరీలో గుమాస్తాగా చేరాడు. ఆ వచ్చే అరవై రూపాయలు పొదుపుగా వాడుకొని మిగిలినది దాచేవాడు. కానీ ఎంతకాలం చేరిస్తే తన కోరిక సఫలమవుతుంది? 'ఇక ముసలివాడనయినా చదువుకోవలసిందే . . .' అనుకొని నిరాశ చెందేవాడు.

ఒకరోజు ఫ్యాక్టరీ యజమాని నవీన్‌ని రమ్మని కబురంపారు. తనవల్ల ఏమి అపరాధం జరిగిందో అని భయపడుతూ ప్రొప్రయిటర్ గదిలోనికి వెళ్ళాడు.

"గుడ్‌మార్నింగ్, సర్."

" . . . . . . "

"గుడ్ మార్నింగ్, సార్." ఈసారి కొంచెం గట్టిగా అన్నాడు. కాని ప్రొప్రయిటరు తల ఎత్తలేదు. అతని ఉనికి గమనించనట్లు ఏదో వ్రాసుకొంటున్నాడు.

'హూఁ . . . ఎంత గర్వం! వినిపించుకోనట్లు నటిస్తున్నాడు. దీనికంతా మూలం డబ్బు . . . తనకది లేదు . . . తను పేదవాడనే కదా ఇంత చులకన!' ఒక్కసారిగా ఆవేశం వచ్చింది. బలవంతాన కోపం దిగమింగి, "సార్ ... మీరు నన్నెందుకో పిలిపించారట" అన్నాడు హెచ్చుస్వరంతో.

ప్రొప్రయిటరు అతని వాలకం గమనిస్తూనే ఉన్నాడు. అతనికి స్వాభిమానం ఎక్కువ అని గుర్తించాడు. పైకి మామూలుగా ఏమీ ఎరగనట్లు, "ఏమోయ్ . . . ఇలా వచ్చావు?" అన్నాడు.

నవీన్‌లో సహనం సన్నగిల్లింది. "సార్, మీరే కదూ నన్ను పిలిపించారు." ఎంత ప్రయత్నించినా ఆ గొంతులో విసుగు స్పష్టంగా వినిపించింది.

"చూడు, నవీన్ . . . అంత విసుగు, కోపం పనికిరావు. అయినా నీగురించి నేను కొన్ని వార్తలు విన్నాను . . . "

పూర్తికాకముందే నవీన్, "చూడండి . . . మీకు నా పని తృప్తికలిగించకపోతే స్వయంగా కనుక్కోండి . . . అంతేగానీ చెప్పుడు మాటలు విని ఏ నిర్ధారణకి రాకండి" అన్నాడు ఉద్వేగంతో. మరుక్షణంలోనే తన తొందరపాటుకు నొచ్చుకున్నాడు. 'పేదవాని కోపం పెదవికి చేటు' . . . ఈ జీవనాధారం కూడా లేకుండాపోతే ఏమిటి గతి?

ప్రొప్రయిటర్ అతని మొహంలోకి పరీక్షగా చూచాడు. అతని మొహంలో దైన్యం గమనించాడు. కాని, మందలింపుగా అన్నాడు: "నీకంత తొందరకూడదు. నేను చెప్పడం సాంతం వినకుండా ఎందుకలా నోరు జారడం . . . చెప్పు . . . ఈసరికి ఇంకొకరైతే నీ చేతిలో 'డిస్‌మిస్' ఆర్డరు పెట్టి ఉండేవారు."

నవీన్ తలవంచుకొని, "క్షమించండి!" అన్నాడు.

"నవీన్, . . నీ కధంతా నాకు తెలుసు . . . నీకు పెద్దచదువులు చదివి బాగా పైకి రావాలని ఉంది . . . నాకు తెలుసు . . . కానీ, నీవు నీ పనిలో ఎంత శ్రద్ధ చూపెడతావో అని పరీక్షించా . . . నీవు చిన్నవాడవయినా ఎంతో ఓర్పుతో పనిచేశా వింత కాలం. నాకు చాల సంతోషంగా ఉంది" అంటూ లేచి నవీన్ భుజం తడుతూ, "నీ ఆశయం నేను తీరుస్తా . . . నా కోరిక ఒకటి నువ్వు తీరుస్తావా?" అన్నాడు.

నవీన్‌కు ఆ మాటలు అమృతప్రాయంగా వినిపించాయి. తన చెవులను తాను నమ్మలేనట్లు "ఏమిటి సార్, మీ రనేది . . . ఈ పేదవాడు మీ కోరిక తీర్చడమా?" అన్నాడు.

"ఔను, నవీన్ . . . ఈ పేదవాడే నా కోరిక తీర్చగలడు . . . నాకు గట్టి నమ్మిక. నీ కోరికప్రకారం కాలేజీలో చేరి చదువుకో. దాని కయ్యే ఖర్చులు నేను భరిస్తాను . . . తరవాత నా కోరిక . . . "

నవీన్ రెండుచేతులు ఎత్తి నమస్కరించాడు. అతని కళ్ళలో నీళ్ళు తిరిగింది. "నన్ను క్షమించండి, సార్ . . . మిమ్మల్ని కించపరిచేలా మాట్లాడాను" అన్నాడు డగ్గుత్తికతో.

"ఇందులో క్షమించడాని కేముంది, నవీన్ . . . నీవు అభిమానధనుడవు . . . కాబట్టే అంత ఆవేశపడ్డావు. . . అది సహజమే." తిరిగి భారంగా నిట్టూర్పుతూ అన్నాడు: "చూడు, బాబూ . . . నిన్ను చూచినప్పటినుండి నా కుమారుణ్ణి చూచినట్లుంది... వాడు నీలాగే పౌరుషవంతుడు . . . ఒక చిన్న విషయంలో మా ఇద్దరికీ ఘర్షణపడింది. నేనూ పట్టుదలతో అతని మాటలు వినలేదు. . . కోపంతో ఇల్లు వదిలిపోయాడు. ఆరు సంవత్సరా లయింది. ఎంత వెదికించినా అతని జాడ తెలియలేదు. . . నాకెంతో ఐశ్వర్యం ఉంది . . . కాని కలిసి అనుభవించడానికి భార్యా పిల్లలూ ఎవ్వరూ లేరు . . . ఆఖరుకి నేను చనిపోతే తలకు కొరివి పెట్టడానికికూడా 'నా' అన్నవాళ్ళు లేరు" అంటూ కంట తడిపెట్టాడు.

నవీన్ హృదయం ద్రవించింది. జాలిగా అతనివైపు తిరిగి, "మీరు బాధపడవద్దండి. అతను ఏ రోజో ఒకరోజు తప్పక తిరిగి వస్తాడు!" అన్నాడు.

"లేదు, బాబూ . . . నీవు ఒంటరిగా జీవిస్తున్నావు. నాకా వయసయిపోతూంది . . . ఇక నేను పోతే, ఈ ఆస్తికి దిక్కూ దివాణం ఉండదు. నాకు బాగా తెలుసు. వాడిక రాడు." దీనంగా నవీన్‌వైపు చూచాడు. అతని కళ్ళలో ఏదో తీరని కోరిక కనిపిస్తూ ఉంది. "బాబూ . . . నీవు, నేను ప్రస్తుతం ఒకే జీవితం గడుపుతున్నాము. నీకు తలిదండ్రులు . . ." అన్నాడు.

"ప్చ్ . . . లేరండీ . . . ఆ ఇద్దరి ప్రేమకు నోచుకోని దౌర్భాగ్యుడిని. మా తాతగారే నన్ను పెంచి పెద్దవాడిని చేశారు . . . నా దురదృష్టంకొద్దీ ఆయనకూడా నేను స్కూలుఫైనల్ పాసుకాకముందే నన్ను ఏకాకిని చేసి కన్నుమూశారు."

"అయ్యో, పాపం! నీవు నాలాగే 'అనాథ' వన్నమాట . . . మరి మనం ఇద్దరం ఒకరి కొకరు తోడుగా ఉందామా, నవీన్!"

"ఏమిటి, సార్ మీరనేది?"

"ఔను, బాబూ. నాతోపాటే ఉండు . . . కాలేజీలో చేరు. నువ్వు కృష్ణారావు రెండవ కుమారుడు కావడానికి ఏమైనా అభ్యంతరమా?"

"ఎంత మాటన్నారు! ఈ అభాగ్యునికి అంతకంటె వేరే భాగ్యం ఏముంటుంది?"

"నవీన్ . . . నాయనా!" అంటూ ఆనందంతో కృష్ణారావు నవీన్‌ను తన కౌగిలిలో బంధించాడు. అతని

## రేవనూరి సువర్ణ

కళ్లనుండి ఆనందబాష్పాలు రాలాయి.

ఆనాటినుండి నవీన్ ప్రొప్రయిటరు కృష్ణారావు కుమారుడయ్యాడు. తండ్రి ప్రేమ ఎటువంటిదో ఎరగని నవీన్ కృష్ణారావు ప్రేమాదరణలకు మురిసిపోయాడు. అతని ఆశయం నెరవేరింది. అతని హృదయమంతా కృష్ణారావుపై కృతజ్ఞతాభావంతో నిండిపోయింది.

నవీన్ సహజంగా కొంటెవాడు. ఎప్పుడూ ఎవరినో ఒకరిని ఏడిపించడమంటే సరదా. ఆడపిల్లల నుండి క్లాస్ లెక్చరర్లవరకూ అందరినీ అల్లరిపెట్టేవాడు. ముఖ్యంగా కాలేజీ విద్యార్థినులకు నవీన్ అంటే సింహస్వప్నం. అడకువగా, వినయ విధేయతలతో ఉండే ఆడపిల్లల జోలికి పోయేవాడుకాదు. రకరకాల ఫాషన్లతో ఉండే అధునాతన యువతీమణులంటే నవీన్‌కు పడదు. వాళ్లకు మారుపేర్లు పెట్టి పలు విధాల ఏడిపించేవాడు.

* * *

సిరిసంపదలతో తులతూగుతూ ఒక్కగానొక్క కూతురు శ్యామలతో ఆనందసాగరంలో మునిగిపోయాడు రమణారావు. శ్యామల పుట్టుకతోనే కూతురిని చూచుకొని మురిసే ఆనందం లేకుండానే భగవంతుడు రమణారావు భార్యను ఈ లోకంనుంచి తీసుకెళ్లాడు. శ్యామలకు తల్లి జ్ఞాపకమే తెలియదు. శ్యామలంటే రమణారావుకు ఎక్కడలేని అభిమానము, అమితమైన ప్రేమ. ఆమె నడిస్తే కాలు ఎక్కడ నెలుకుతుందో, ఎంత అలిసిపోతుందో అని అతనికి బాధ. ముద్దుముచ్చటలతో అనురాగంగా పెరిగిన శ్యామలకు కొంటెతనం ఒక శోభ నిచ్చింది. శ్యామల మనసు నిర్మలమేకాని, పట్టె పెంకిపిల్ల. స్వాభిమానం ఎక్కువ. ఎంత చిన్నమాటన్నాసరే పడదు. 'తను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు' అనేటంత మొండిది. శ్యామల వయసుతోపాటు నవయౌవనవతిగా తయారయింది. ఆమెకు 16 సంవత్సరాలు. రమణారావుకు శ్యామలకు పెళ్లిచేయాలని ఆందోళన అమితమయింది. కాని, వెళ్లడించేవాడు కాదు. ప్రెసిడెన్సీ కాలేజీలో బి. యస్‌సి. మొదటి సంవత్సరం చదువుతూఉంది. ఎలాగో రెండు సంవత్సరాలు గడిస్తే శ్యామల వివాహం చేయవచ్చు అని అనుకొని రమణారావు తనకున్న డబ్బంతా శ్యామలపేరట బ్యాంకులో వేశాడు.

ఆనాడు లైబ్రరీవద్ద నవీన్ మాటలు విన్నప్పటినుంచి ఒకప్రక్క కోపంతో మరొక ప్రక్క ఏదో తెలియని ప్రేమతో బాధపడసాగింది శ్యామల. తనకు తెలియకుండనే తన మనస్సు అతనికి అర్పించినట్లు అయింది శ్యామలకు. ప్రతి నిమిషం ఆమె మెదడులో అతని తలంపే, అతని కొంటెపనులే సినిమారీలులా పరిగెత్తసాగాయి.

ఒకనాడు శ్యామల పుస్తకాలు సర్దుకొని గబగబా క్లాసులోనుంచి పోబోయింది. క్లాసులో ఎవరూ లేరు. అదే సమయమనుకొని నవీన్ శ్యామదగ్గిరగా వచ్చాడు.

"శ్యామలా!"

"ఏమండీ . . ." అంటూ అతని ముఖంలోకి చూచింది.

"శ్యామలా! ఎందుకు ఈ రోజు ఇంత శీఘ్రంగా ఇంటికి పోతున్నావు? తరవాత క్లాసు అటెండు చెయ్యవా?"

"లేదు" అంది ముక్తసరిగా.

"శ్యామలా! ఆనాడు నిన్ను అలా ఏడిపించానని కోపమా? ఎందుకు ఈమధ్యంతా నన్ను తప్పుకు తిరుగుతున్నావు? అయినా, శ్యామలా, నీ వెంతో గడసరివి. తెలుసా?"

"ఓహో! ఈనాటికి గ్రహించారా . . ."

"లేదు. నిన్ను చూచిననాడే నిన్ను అర్థంచేసుకున్నాను. నా మనసుకూడా మీకు . . ."

"ఏమిటి, మీరు మీ మనసుని నాకు . . ."

"అర్పించాను, శ్యామలా . . . నన్ను ఒళ్ళు మరిపించి నీచుట్టూ తిరిగేలా చేశావు. నీ దాసునిగా చేసుకున్నావు."

శ్యామలకు అతని మాటలు వింటుంటే ఒకపక్క సిగ్గు, మరొకపక్క ఏమీ తెలియనిదానిలా నిలచె.

"ఇంకా ఎంతకాలం నన్ను ఏడిపిస్తావు, శ్యామలా? ఏమిటి నీ ఉద్దేశం?"

"నేనేమి చేశాను? మీరు మీ మనసు అర్పించారు. మరి, నా హృదయం ఇంకొకరికి అర్పితమైంది, నవీన్" అంది అతనిని ఏడిపించే ఉద్దేశంతో.

"శ్యామలా . . . అంతమాట చెప్పకు. నీ ప్రేమ పొందాలని ఎంతో ప్రయత్నించాను. కాని నే నేమి మాట్లాడినా సరిగా బదులు ఏ రోజు ఇవ్వలేదు. నేనేం చేశాను, శ్యామలా? ఎందు కంత కోపం? నీ హృదయం ఇంకొకరికి అంకితం కాలేదు, శ్యామా . . . అది నాది . . ."

> **మృత్యువు**
>
> మనిషి ప్రతి నిమిషము చనిపోతాడు; ప్రతి నిమిషము జన్మిస్తాడు.
>
> —టెన్నిసన్

"ఆహా . . . ఎంత మంచి మాట . . . అయితే నేను మీ స్వంతమా . . . అందుకనే కాబోలు అందరి ఎదురుగా నన్ను ఎగతాళి పట్టించారు."

"శ్యామలా, కోపం వద్దు. అదంతా ప్రేమవల్ల చేశాను . . . మన్నించు."

"అదేమిటండీ, మీపైన నాకేం అలక?"

"అయితే, శ్యామా . . . నామీద మీకు కోపం లేదా? అయితే మీ హృదయం నాకే . . ."

"ఎంత తొందర! ఏం ఈ శ్యామల అంత సులభంగా చిక్కుతుందా?"

"చిక్కుతుందా? . . . చిక్కింది. నా శ్యామలా రాణి కోసరం ఈ ప్రాణం అయినా ఇవ్వగలను . . . ఎందుకు అలా చూస్తావు . . . నే మాట్లాడడం బాగులేదా? నీకు సమ్మతంగా లేదా . . ."

"ఏం సమ్మతమండి?"

"అదే . . . మన వివాహం . . ."

"అరే, ఎంత తొందర అయ్యగారికి? అయినా, మీకు నామీద ఎంత అక్కర, నవీన్‌బాబూ . . . ఆఁ . . . అన్నట్లు ఎందుకు వచ్చిన గొడవ? నే వెళ్లాలి, ఇంటి దగ్గిర మా నాన్న ఎదురుచూస్తూంటారు" అంది.

మనసులో ఏదో ఆనందం, పెదవులపై ఏదో చిరుహాసం.

"అబ్బా, చూచావా . . . ఎలా బాణాలు రువ్వుతున్నావో . . . ఆ పెదవులపై ఆ నవ్వు . . . శ్యామా, నిన్ను చూస్తూంటే నాకు పిచ్చిపట్టేలా ఉంది."

"ఓ . . . ఓ . . . ఓ . . . కవిత్వం ఆపండి. పిచ్చి పట్టించుకోకండి" అంది కొంటెగా.

"ఏం ఇది ఒక కవిత్వమా? నిజంగా నేను కవినై ఉంటే . . ."

"ఉంటే?"

"నా శ్యామలను ఎన్ని రూపాలతో వర్ణించేవాడినో నీకెలా తెలుస్తుంది! నిన్ను చూస్తూంటే వికసించిన గులాబిలా, మధువుతో నిండిన పువ్వులా . . . చంద్రబింబంలాంటి ఆ ముఖం, కమలములవంటి కనులలో ఆ కాటుక సొయగాలు, పెదవులపై ఆ తియ్యని అందాలు . . . అబ్బ, నేను నా ఒళ్ళు మరిచిపోతున్నాను."

"అబ్బబ్బ, వారించండి మీ కవిత్వం!"

"ఏం నీకు నచ్చలేదా?"

"నచ్చకేం . . . బాగా . . . చాలాబాగా నచ్చింది."

"మరి, ఇంతకీ మన పెళ్లిమాట? . . ."

"లేదు, మహాశయా. ఇప్పుడు నా ప్రాణాలు తీయకండి." సిగ్గుతో అంది శ్యామల.

"ఎంతమాట! నా చిలక ప్రాణం నేను తీస్తానా?"

"ఏమిటి, నవీన్‌గారూ . . . ఈనాడు మీరు మరీ మితిమీరిపోతున్నారు! . . . నన్ను వెళ్లనివ్వండి."

"లేదు, వెళ్లనివ్వను. నా ప్రశ్నకు సరిఅయిన జవాబు రానిదే ఈ దీనుడు వదలడు, తెలిసిందా?" అంటూ ఆమె చేతులు రెండూ గట్టిగా పట్టుకున్నాడు.

శ్యామల దేహమంతట గగుర్పాటు కలిగింది. ఏదో ఆనందం హాయి నిచ్చింది.

"శ్యామలా, నీ హృదయం నాకే కదూ ఇచ్చావు?"

"అవును . . ."

"మరి, నన్నెందుకు పరీక్షిస్తావు? ఏం నేనంటే అంత . . . అంత ఇష్టంలేదా?"

"ఇష్టమేకాని . . ."

"కాని . . . చెప్పు, శ్యామా, చెప్పు . . ."

"ఎంత తొందర! . . . మీ కవిత్వం అంటే తలనొప్పి."

"అయితే, శ్యామలా, నిజంగా నీవు నన్ను ప్రేమిస్తున్నావా?"

"అవును. మీరంటే గౌరవం, భక్తి, దయ."

"అంతేనా . . . అయితే ప్రేమ లేదా?"

"ప్రేమా! . . . అదేమిటండి?"

"ఏయ్, కొంటెపిల్లా, ప్రేమంటే తెలియదా?"

"ఏమో!"

"ప్రేమతోనేకదా లైలామజ్నూలు, రోమియో జూలియట్‌లూ, రాధాకృష్ణులూ అన్ని అవస్థలువడ్డారు."

"పడితే . . . నన్నుకూడా పడమంటారా, బాబూ!"

"శ్యామలా! ఏం నన్ను పిచ్చివాణ్ణిగా చేసి తప్పుకుందామనుకున్నావా? . . . అలా ఎన్నటికీ వీలుకాదు" అని చుట్టుపక్కల ఎవరూ లేరని తెలుసుకొని గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు. శ్యామల ఆనందసాగరంలో మునిగి లోకాన్నే మరిచిపోయింది. ఇద్దరిలో ఏదో విజయగర్వం తొణికిసలాడింది.

* * *

పరీక్షలు పూర్తిఅయాయి. నవీన్ ఫస్టుక్లాసులో పాసయ్యాడు. కృష్ణారావు ఆపైన ఏం చేయాలని ఉందని అడిగాడు. నవీన్‌కు చదువుమీద ఇచ్ఛ సన్నగిల్లింది.

సినిమా విషయాలు చూసుకుంటూ ఇంట్లోనే ఉంటా ననే టగానే కృష్ణారావు సంతోషంతో సమ్మతించాడు. ఆయనకుకూడా మనసులో అదే భావం. ఎలాగూ తనకు వయసు మళ్ళింది. తాను కళ్ళుమూసేలోగా నవీన్‌కు ఆ వ్యాపారం అప్పగించి అతన్ని ఓ ఇంటివాణ్ణిగా చెయ్యా లని అభిలాష.

ఒకనాడు కృష్ణారావు అతని ప్రియమిత్రుడు రమణారావుకు కబురంపాడు. రమణారావు వచ్చాడు. ఇద్దరూ కలిసి పెళ్ళివిషయాలు మాట్లాడుకొని ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ సంగతి నవీన్, శ్యామలలకు తెలిసింది. వారి ఆనందం చెప్ప నలవికాదు. ఇద్దరూ వారి వివాహజీవితం గురించి ఆలోచిస్తూ రాబోయే అనుభవాలను తలుచుకుంటూ ఆనందసాగరంలో మునిగి పోయారు.

ఒక సుముహూర్తాన పెద్దలు నిర్ణయించిన ప్రకారం నవీన్, శ్యామలల వివాహం అతి వైభవంగా జరిగింది. పెళ్ళికి వచ్చిన బంధుమిత్రులంతా వెళ్ళిపోయారు. తన నేర్పంతా ఉపయోగించి ఎలాగైనా నవీన్‌ను ప్రసన్నునిగా చేసుకుంది శ్యామల.

రాత్రి పదిగంటల సమయం. నవీన్ ఏదో ఆలో చిస్తూ పడుకున్నాడు. శ్యామల గాజులు చప్పుడుచేస్తూ గదిలోకి వచ్చింది. నవీన్ శ్యామలను ఏడిపించాలని నిద్రపోతున్నట్లు నటించసాగాడు. శ్యామల మెల్లిగా వంగి అతని మొహంలోకి చూచి, రేగిన జుత్తు సరిచేస్తూ అతనిపక్కనే కూర్చుంది. నవీన్ ఊపిరి బిగబట్టాడు. శ్యామల లేచి లైటు ఆర్పేసి మంచంమీద నవీన్ పక్కగా పడుకుంది. నవీన్ ఇక ఓర్చుకోలేకపోయాడు ఆ నిశ్శబ్ద వాతావరణం. ఒక్క ఉదుటున లేచి నవీన్ శ్యామలను గట్టిగా హృదయానికి హత్తుకొని చెక్కిలి మీద ముద్దులవర్షం కురిపించాడు.

“అబ్బ . . . ఏమిటండి . . . మీ రింకా నిద్ర పోలేదా? . . . ఎంత దొంగవారు . . .” అంటూ అతని బాహుబంధంనుంచి విడిపించుకోవాలని పెనుగు లాడసాగింది. కాని, నవీన్ పట్టు విడవలేదు.

“ఇప్పుడుకూడా ఏమిటి, శ్యామలా, నీ నటన? . . . ఇక్కడెవరున్నారని, . . . నీవు . . . నేను . . .” అంటూ ఆమెను తిరిగి కౌగలించుకున్నాడు నవీన్.

“ఏమండి . . . మీరు . . . నన్ను . . .”

“నిన్ను . . . చెప్పు, శ్యామా . . .”

“ఊహూఁ . . .”

“ఏం సిగ్గా? . . . ఎంత అందంగా ఉన్నావు ఆ బుంగమూతితో!”

“చాల్లెండి మీ సరసాలు . . .”

“నీతోకాక మరెవరితో సరసాలు . . . పోనీలే, నీ బదులు మరెవరైనా ఉన్నారా, చెప్పు . . .”

“ఓహో ... అంత పనికూడా చేస్తారన్నమాట...” అంది లేనిపోని కోపంతో.

“రాణిగారికి అప్పుడే కోపం . . . స్త్రీబుద్ధి చూపావు, శ్యామా . . .”

శ్యామల పట్టరాని సిగ్గుతో అతని ఒడిలోకి వాలి పోయింది. ఆ రాత్రంతా వారు లోకాన్నే మరిచి పోయారు. ఈ విధంగా వారి దాంపత్యంలో దినాలు, వారాలు, నెలలు గడిచిపోయాయి.

* * *

“టెలిగ్రాం, టెలిగ్రాం” అంటూ పోస్టుమాన్ అరిచాడు. నవీన్ ఆత్రతతో బయటకు వచ్చి టెలిగ్రాం అందుకొని, అందులోని సారాంశం తెలిసి చాలా బాధ పడ్డాడు.

“ఏవరండీ . . . ఏముంది?”

“శ్యామా, మీ నాన్నగారికి హఠాత్తుగా గుండెనొప్పి వచ్చిందట . . . నిన్ను వెంటనే బయలుదేరి రమ్మని శంకరయ్య టెలిగ్రాం ఇచ్చాడు” అని చెప్పాడు విచారంతో.

“ఏమిటండీ, దానికేం. వెంటనే బయలుదేరండి.”

“అలాగే . . .”

కృష్ణారావుతో ఈ విషయమంతా చెప్పి నవీన్, శ్యామలలు బయలుదేరారు. ఊరు చేరేసరికి రాత్రి 10 గంటలు. శ్యామల మనసునిండా ఏదో పిచ్చి పిచ్చిగా ఆలోచనలు. ఇల్లు చేరేసరికి ఇంటినిండా జనం ... ఏడుపులు.. ఆ ఏడుపులే నవీన్‌కు అంతా అర్థమయ్యేలా చేశాయి. రమణారావు ఈ లోకం వదిలాడు ... శ్యామలకు గుండెధైర్యం చెప్పాడు నవీన్. దహనక్రియలన్నీ అయిపోయాయి. నవీన్, శ్యామలలు వాళ్ళ ఊరు చేరారు.

కొన్ని రోజుల కాలం గడిచిపోయింది. హఠాత్తుగా చైనీయులు మన దేశంపై యుద్ధం ప్రకటించారు. నవీన్ దేశంకొరకు యుద్ధంలో చేరాడు. శ్యామలకూడా అందు కేమాత్రం అభ్యంతరం పెట్టలేదు ... దేశ రక్షణే తన రక్షణ అని తీర్మానించుకుంది. నవీన్ నుదుటిపై సింధూర తిలకం దిద్దింది. “విజయులై రండి” అని ధైర్యంతో అతన్ని పంపింది. నవీన్‌కూడా ఆమె ధైర్యసాహసాలకు విస్మితుడై ఆనందంతో కదన భూమికి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళగానే శ్యామల కూడా మామగారి అనుమతితో “ఎమర్జెన్సీ నర్సు ట్రైనింగు”లో చేరింది. చేరిన కొన్ని నెలలకే కృష్ణా రావు మరణించాడు. వెంటనే ఇల్లు చేరింది. భర్త కొరకు వేయిదేవుళ్లకు మొక్కుకుంది. ఎన్నో పూజలు చేసింది. కాని, చివరకు ఆమెకు కలిగిన ఫలితం వ్యతిరేకం. నవీన్‌కూడా ఆమెను ఒంటరిదాన్ని చేసి యుద్ధంలో వీర మరణం పొందాడు. కేప్టెన్‌గా అతను చూపిన ధైర్య సాహసాలు పత్రికలలో చదివింది. ఆమె దుఃఖానికి అంతు లేదు.

రోజులు గడుస్తున్నాయి. కాలం ఎటువంటి దుఃఖాన్నైనా మరపింపజేస్తుంది. అది సహజం. శ్యామల ఇప్పుడొక మరబొమ్మలా తయారైంది గుండె రాయిగా చేసుకుంది. మనసటిలా ఆమెలో చరాకీతనంగానే, ఎటువంటి ఆనందంకాని లేదు. అంతా విధి . . . విధి . . .

* * *

విజయ్ నవీన్ కోరిక ప్రకారం అతని అడ్రసుతో వాళ్ళింటికి బయలుదేరాడు. ఇల్లు తెలుసుకొని లోపలికి పోయాడు. బయట ఎవరూ కనిపించలేదు. హాలులోకి వెళ్ళాడు . . . ఎదురుగా ఒక పెద్ద ఫోటో . . . మాలవేసి ఉంది. ‘ఏమి టీ విచిత్రం! ఆ ఫోటో తన తండ్రిది కదూ? . . . అంటే నవీన్‌కు, తనకు ఏమిటి సంబంధం?’ ఏమీ అర్థంకాక విజయ్ మనసంతా గందరగోళంగా తయారైంది.

అంతలో శ్యామల వచ్చింది. అపరిచిత వ్యక్తిని చూచి ఆగిపోయింది. విజయ్ తలఎత్తి చూచాడు.



VAPI:BS:7/68—TE

"మీరు . . ."

"ఇంతకీ మీ రెవరో, ఎందుకొరకు వచ్చారో . . ."

"నా పేరు విజయ్ . . . చూడండి, ఆ ఫోటోలో ఉన్న ఆయన . . ."

"మా మామగారండి. ఆరునెలల క్రితం చని పోయారు."

"ఏమిటి మా తండ్రి మరణించారా!" బాధతో ఫోటోవద్దకు వెళ్లి, "నాన్నగారూ, నన్ను మన్నించండి. అవసానదశలోకూడా మీదగ్గిర ఉండి సేవ చేయలేక పోయాను . . . చివరకు ఈ విధంగా ఇంటికి రావలసి వచ్చింది" అంటూ దుఃఖించాడు. శ్యామల కేమి అర్థం కాలేదు. ఆశ్చర్యంతో అతన్నే చూస్తూ నిలుచుండి పోయింది.

కొన్ని నిమిషాల తరవాత విజయ్ తేరుకొని శ్యామల వంక చూచాడు. అప్పటికిగాని తెలుసుకోలేకపోయాడు, శ్యామల తెల్లచీర కట్టుకొని ముఖంలో బొట్టు లేకుండ కళావిహీనంగా ఉందని.

"చూడండి, మీకు నవీన్ మరణవార్త . . ."

"విజయ్‌బాబూ . . . నాకు ఎప్పుడూ వారి తలంపే. యుద్ధానికి పంపానేకాని, ఆయన పోయిన క్షణంనుంచి నా మన సెంత దుఃఖపడిందో! . . . ఎందుకు పంపానా అనికూడా ఒకొకమారు అనుకొనేదాన్ని . . . ప్రతి రోజు అక్కడి విశేషాలు పత్రికల్లో చదివేదాన్ని . . . చివరకు ఆయన చావుకూడా . . ." అంటూ దుఃఖించింది.

"క్షమించండి . . . అనవసరంగా తిరిగి మీకు పాత కథతో దుఃఖం కలిగించాను."

" . . . . . . "

"శ్యామలగారూ . . ."

శ్యామల కళ్లు తుడుచుకుంటూ తల ఎత్తింది. ఆమె ముఖంలో ఏదో తెలియని అందం అతనిని ఆకర్షించింది. 'అందుకే నవీన్ శ్యామలను గురించి ప్రతి నిమిషం ఏకరువుపెట్టాడు . . . ఆమె అందాన్ని తలుచు కుంటూ ఎప్పుడు తిరిగి నా శ్యామలదగ్గిరికి చేరుతానా అని విలపించేవాడు . . .' అని మనసులో ఆలోచించ సాగాడు విజయ్.

"అయ్యో, నా తెలివి మండ! ఇంతవరకు మిమ్మల్ని కూర్చోపెట్టకుండానే మాట్లాడుతున్నాను . . . కూర్చోండి . . ." అంటూ, "గురవయ్యా . . . గురవయ్యా . . ." అని కేకపెట్టింది శ్యామల.

గురవయ్య వచ్చాడు. "చూడు, గురవయ్యా, ఈయన ఎవరో తెలుసా? మన అయ్యగారి పెద్దకొడుకు విజయ్‌బాబుగారు . . . చూడు, ఈయనకు అన్ని ఏర్పాట్లు చెయ్యి" అంది.

"నమస్కారం, బాబూ . . . అలాగే, అమ్మగారూ" అంటూ గురవయ్య వెళ్లిపోయాడు.

ఇద్దరూ కొంతసేపు మాట్లాడుకున్నారు. శ్యామల విజయ్‌ని విశ్రాంతి తీసుకొనమని చెప్పి తన గదికి వెళ్లిపోయింది.

ఆ రాత్రంతా శ్యామల ఏదో ఆలోచించసాగింది. తెల్లవారింది. విజయ్ మేడ దిగి వచ్చాడు. హాల్లో సూటు కేసుతోపాటు శ్యామల నిలుచుండడం చూచి ఆశ్చర్యంతో తొట్రుపడుతూ శ్యామలవైపు చూచి, "మీరు . . ." అంటూ ఆగిపోయాడు విజయ్.

శ్యామల రెండుచేతులు జోడించి, "నాకు సెల విప్పించండి, విజయ్‌బాబూ . . ."

"ఎక్కడికి వెడతారు? . . . మీకు . . ."

"నే నిక్కడ ఉండి ఏమి చేసేది, విజయ్‌బాబూ . . . ఇంతకాలం ఇక్కడ నా బాధ్యత ఉన్నదని ఎంచి ఉన్నాను. ఇప్పుడు మీరు వచ్చారు . . . ఆ పరమాత్ముడే మిమ్మల్ని మీ ఇంటికి పంపాడు . . . ఇక నేను . . ."

"అదేమిటండి, అలా మాట్లాడుతారు . . . నేను రావడం, మీరు పోవడమూ . . . నవీన్, మా నాన్నగార్ల లోనే ఈ ఇంటి బంధం తెంచుకుంటారా? . . ."

"విజయ్‌బాబూ, అంతమాట అనకండి . . . నా మాటల వల్ల మీకు బాధ కలిగిఉంటే క్షమించండి . . . ఎంతయినా నేను ఇక్కడ ఇకనిమీదట ఉండడం సమంజసం కాదేమో . . ."

"శ్యామలా! . . ."

శ్యామల ఆశ్చర్యంతో అతను అంత చొరవగా పిలవడం గమనించి ఏమి మాట్లాడలేకపోయింది.

ఇంతలో గురవయ్య వచ్చాడు.

"గురవయ్యా, వెళ్లి బండి సిద్ధంగా ఉందో లేదో చూడు . . ."

"ఆగు, గురవయ్యా . . ." విజయ్ శ్యామలవైపు చూచి, "చూడు, శ్యామలా . . . ఈనాటికి ప్రయాణం చాలించు. చూడు, గురవయ్యా . . . నువ్వు వెళ్లు" అన్నాడు.

"అలాగే, బాబూ . . ." గురవయ్య వెళ్లిపోయాడు.

"ఎందుకండి నా ప్రయాణం ఆపుతారు?"

"అవును. నీతో కొన్ని ముఖ్యవిషయాలు మాట్లాడాలి. ముఖ్యంగా మీ ప్రియుడైన నవీన్ నాతో కొన్ని విషయాలు చెప్పాడు . . . అదంతా తెలుసుకొని నీకు సమంజసంగా లేకుంటే వెళ్లవచ్చును."

శ్యామల బదులు చెప్పలేదు. వెంటనే మేడమెట్లెక్కి వెళ్లిపోయింది గదికి.

• • •

విజయ్ ఆలోచించసాగాడు. శ్యామలకు తన భావ


హమామ్‌తో ప్రతి దినము స్నానము చెయ్యండి. హమామ్ మీ శరీరమును శుభ్రపరచుటయే గాక, దానికి కాంతినిచ్చి, హాయిని గొల్పుతుంది. ప్రతిరోజూ హమామ్ వాడండి...ఈ సబ్బు మాత్రమే వాడకానికి చాలా రోజులువస్తుంది.

హమామ్ వల్ల తాజాగాను కాంతిగాను వుండండి




వాడకములో చాలా రోజులు వచ్చే టాయిలెట్ సబ్బు

టాటా ఉత్పత్తి

CMTH-4A Tl.

ఎలా వ్యక్తంచెయ్యాలో తెలియడంలేదు. దీర్ఘంగా నిట్టూర్చి ఈజీచైరులో మేను వాల్చాడు. ఎదురుగా గోడమీద నవీన్ ఫొటో నవ్వుతూ తనవైపే చూస్తున్నట్టు అనిపించింది. తామిద్దరూ కలిసి ఎక్కువ రోజులు మసలకపోయినా, ఏదో విడరాని అనుబంధం వారిని ఒక్కటిగా చేసింది. ఎంతో సన్నిహితంగా ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంత అన్యోన్యంగా ఉండేవారు. నవీన్ ప్రతిఒక చిన్న విషయం విజయ్‌కు చెప్పేవాడు. ఆ రోజు నవీన్ చనిపోతూ ఆఖరి దశలో అన్న మాటలు చెవుల్లో ఇప్పటికీ గింగురుమంటున్నాయి. ఆఖరి గడియవరకూ నవీన్ చింతల్లా ఒక్కటే . . . శ్యామల ఒంటరిదై పోతుందనే . . . తన చేతిని పట్టుకొని గద్గద స్వరంతో నవీన్ అన్న మాటలు తను ఈ జన్మలో మరిచిపోలేడు ... "విజయ్ ... నీవు నాకు అన్నతో సమానం . . . సోదరప్రేమ తెలియని నాకు సోదర ప్రేమను ఇచ్చావు . . . నా కష్టాలను నీ కష్టాలుగా భావించి దుఃఖపడ్డావు . . . శ్యామలకు, నాకు వివాహమయి సరిగా సంవత్సరం గడిచింది. శ్యామలను నే నెంత ప్రేమించానో నీకు చెప్పాలంటే ఈ జన్మ చాలదు . . . అయినా, విజయ్ . . . నా గురించి నాకు చింత లేదు. . . ఇంక ఎంతోకాలం బ్రతకను" అన్నాడు.

తను వారిస్తూ, "ఛ . . . అలా అనకు నవీన్. ఇంక కొద్ది సేపట్లో అంబులెన్సు వస్తుంది డాక్టరుతో... తప్పకుండా నీవు బ్రతుకుతావు . . ." అన్నాడేకాని తనకు తెలుసు నవీన్‌కు ఆ ఘడియలు సమీపించాయని.

నవీన్ ఒంటిమీది రక్తం ప్రవాహంగా పోతూంది. ఎంత అరికట్టినా ఆగడంలేదు. నవీన్ విజయ్‌వంక వాత్సల్యపూర్వకంగా చూస్తూ, "విజయ్, అంతా నీ పిచ్చి . . . ఇంక నేను బ్రతకడం సాధ్యం కాని పని. నేను మృత్యుముఖంలో ఉన్నాను. . . నే చెప్పవలసింది చాలా ఉంది . . . నన్ను మాట్లాడనివ్వు . . ." అంటూ బాధతో మెలికలు తిరిగిపోయాడు నవీన్.

విజయ్ నిస్సహాయంగా నవీన్ వైపు చూడసాగాడు.

నవీన్ చెప్పుకుపోసాగాడు. "పాపం! శ్యామల . . . ఎన్ని కోరికలు పెట్టుకుందో . . . పసుపు కుంకుమలతో కలకలలాడవలసిన ఆమె మోహం . . . ఇరవై సంవత్సరాలు కాకమునుపే . . .' చెప్పలేకపోయాడు నవీన్.

విజయ్ అతని మాటలు వినలేక, "నువ్వు తప్పక బ్రతుకుతావు, నవీన్ ... నిన్ను నేను బ్రతికించుకుంటాను ... శ్యామలకు ఏ అపచారం జరగదు . . . నా మాట నమ్ము" అన్నాడు.

"నిజంగా శ్యామలకు అపరాధం జరగదు. కదూ, విజయ్ . . ."

"తప్పకుండా . . . విశ్రాంతితీసుకో, నవీన్ . . . ఎందుకు వ్యర్థప్రసంగాలతో ఆయాసం తెచ్చుకుంటావు?"

నవీన్ దుఃఖపూరం తెలాడు. "విశ్రాంతేనా, విజయ్. ఇంక కాస్సేపట్లో దీర్ఘ విశ్రాంతి . . ."

"నవీన్ . . . అంతమాట . . . అనకు"

"చూడు, విజయ్, నిజంగా నా శ్యామల పసుపు కుంకుమలతో ఉండాలనికదూ . . . అయితే, నాకు ఒక మాట ఇస్తావా, విజయ్ ... " అని ఆశతో తనవైపు చూశాడు.

"అలాగే. చెప్పు, నవీన్ . . ."

"చూడు విజయ్, నా శ్యామలకు నేనుతప్ప 'నా' అన్నవాళ్ళు, లేరు. నేను పోతే నా శ్యామల ఏకాకి అవుతుంది. నా ఆత్మకు శాంతి ఉండదు . . విజయ్, నా ఆత్మ శాంతంగా ఉండాలంటే అది నీ చేతుల్లోనే ఉంది . . ."

విజయ్ ఆశ్చర్యంతో, "నా చేతుల్లోనా? . . ." అన్నాడు.

"అవును. ఆమెకు సౌభాగ్యం ఇవ్వాలి. నా శ్యామల ఎల్లకాలం పసుపుకుంకుమలతో కలకలలాడాలి"

నవీన్ కోరిక విజయ్‌కు అర్థమైంది. ఏమి చెప్పలేక మౌనంగా ఉన్నాడు విజయ్. నవీన్ కళ్ళనుంచి నీరు ధారాపాతంగా ప్రవహిస్తూంది. ఏమి చెప్పగలడు తను? అంత హఠాత్తుగా నవీన్ అలా అడుగుతాడంటే ఏం చెప్పాలో తెలియక కలవరపడ్డాడు.

నవీన్ నిరాశగా నిట్టూర్చాడు. "హూ, నీవల్ల కాదంటావు . . . అవునా? . . . పోనీలే ... ఎంత పాపం చేసుకున్నానో నాకు మనశ్శాంతికూడా ఉండదు."

విజయ్ దుఃఖంతో నవీన్ బాధ చూడలేక వెంటనే నవీన్ చేతుల్లో చెయ్యివేసి, "నీ మాట ప్రకారం చేస్తాను . . . నీ శ్యామలను జీవింపచేస్తాను . . . దిగులుపడకు . . . శాంతంగా ఉండు, నవీన్" అంటూ విజయ్ ఆతన్ని గుండెదగ్గర తీసి చేర్చుకున్నాడు.

నవీన్ ముఖం వికసించింది. కంపిస్తున్న పెదవులతో, "విజయ్ . . . నేను . . . నిజంగా పాపికాదు, పుణ్యాత్ముడను . . . నీ స్నేహం నన్ను ఎంత భాగ్యవంతుణ్ణి చేసింది! . . . నాకు అంతే చాలు!" అంటూ మాటలు ముగించాడు. అంతలో శ్వాస ఆగిపోయింది . . . దీర్ఘంగా నిట్టూర్చాడు.

విజయ్ నవీన్ ఫొటోవంక చూచి, 'నవీన్! నీ కిచ్చిన వాగ్దానం నెరవేరుస్తాను. నా ప్రయత్నం సఫలమయేలాగు చూడు . . .' అని మనసులోనే ప్రార్థించుకున్నాడు.


మరునాడు శ్యామల తెల్లవారగానే లేచి తన కార్యక్రమాలన్నీ ముగించుకొని హాలులో పేపరు చదువుకుంటూ కూర్చుంది. విజయ్ వచ్చాడు . . . అతను రాగానే శ్యామల పేపరు పక్కన పెట్టింది.

"శ్యామలా . . . నీతో కొన్ని ముఖ్య విషయాలు నీతో మాట్లాడాలని అన్నాను..."

"అలాగే . . . ఏమిటి విషయాలు?"

"చూడు ... నీవు ఇకముందు ఏం చేయడానికి నిశ్చయించుకున్నావు?" అన్నాడు అసలు విషయం చెప్పడానికి సంకోచిస్తూ.

శ్యామల ఒక జీవంలేని నవ్వు నవ్వింది. "నా విషయంలో మీరు ఇంత శ్రద్ధ తీసుకోవడం ఆశ్చర్యంగా ఉంది. అయినా, విజయ్‌బాబూ, ముందుముందు ఏం చేయాలో నిశ్చయించుకోవడానికి ఏం ఉంది? ఏదో కొంత చదువుకున్నాను. నర్సుగాకూడ కొద్దికాలం తర్ఫీదు పొందాను. ఎక్కడైనా హాస్పిటల్‌లో నర్సుగా చేరుతాను.నాకు ఒకరికి సేవచేయడం అంటే సరదా..."



"ఓ . . . చివరకు నీవు నర్సుగా చేరి నీ జీవితం గడపాలనుకున్నావన్న మాట. అయినా నీ అంత ఓర్పు,గుండెధైర్యం గల స్త్రీలు ఏ నాటికి ఒక్కరో!... నిజంగా నవీన్ ఎంతో దురదృష్టవంతుడు. నీలాంటి భార్యను పొందికూడా అశాంతి మరణం పొందాడు... అతని తుదిఘడియలలో నీ ఆలోచనలతోనే కుమిలి పోయాడు. 'నవల్ల నీ నూరేళ్ల పంట నాశనమై పోయిందని ఎంతగానో వాపోయాడు..." అంటూ ఆగిపోయాడు.

శ్యామల మొహం బాధతో మలినమవడం చూచి, "అయ్యో . . . గతించిన విషయాలు స్మృతికి తెచ్చి నిన్ను బాధపెట్టడం నా ఉద్దేశం కాదు . . . నీకు ఒక మాట . . . అదే నవీన్ ఆఖరి కోరిక . . ."

"ఏమి కోరికండి . . . చెప్పండి . . . నా నవీన్ కోసరం ఏమైనా చేస్తాను . . ." అంది శ్యామల ఆత్రతతో.

"ఎలా చెప్పమంటావు? . . . ఆ విషయం మనిద్దరికీ సంబంధించినది . . . ఒకవేళ నీవు నన్ను అపార్థం చేసుకుంటావేమో!"

"ఎంత మాటండి . . . మీరు ఏ పని చేసినా నా శ్రేయస్సు కోరి చేస్తారని నాకు నమ్మకం . . . చెప్పండి . . . నా నవీన్ కోరిక ఏమిటో."

"నీవు తిరిగి వివాహితురాలవు కావాలి."

శ్యామల ఆశ్చర్యంతో విజయ్ ముఖంలోకి చూచి ఆలోచనలోకి దిగింది.

"ఎండి మోడైపోయిన నా జీవితాన్ని చిగురింప చేయడానికి మీరు . . ."

"అవును, శామా . . . అదే నవీన్ చివరి కోరిక."

"అందుకు మీరు సమ్మతించారా?. . ."

"నా స్నేహితునికొరకు ఏదైనా చేయడానికి నేను తయారుగా ఉన్నాను . . ."

"కాని, మీరు ఏదో ఆవేశంలో అనిడంటారు, విజయ్‌బాబూ. మన సంప్రదాయం, సంఘం గురించి ఆలోచించండి."

"సంప్రదాయం . . . సంఘం . . . నాకు వాటిలో ఏమాత్రం నమ్మకం లేదు. . . నేను ఎవరికీ *జంకను, శ్యామలా! నా గురించి నీకు తెలియదు . . .* నన్ను నీవు అనుమానిస్తున్నావు . . ."

"అంత మాట అనకండి . . , మీరు మీ స్నేహితుణ్ణి ఎంతగా ప్రేమించి ఆదరించి అతని కోరిక తీర్చదలచారో అప్పుడే మీ గుణం నాకు బాగా అర్థమైంది. . . కాని, విజయ్‌బాబూ, స్త్రీ జీవితంలో ఒకమారు ఒకరినే ప్రేమించగలదు . . . కానీ . . ."

"శ్యామలా, నా కర్థమైంది నీ బాధ . . . నిన్ను బాగా అర్థంచేసుకున్నాను . . . నీవు అన్నది సహజం . . . కాని, శ్యామలా! స్త్రీ ఏదైనా చేయాలని తలపెట్టితే అది సాధించగలదు . . . బాగా ఆలోచించే ఒక నిర్ణయానికి రా! . . . ఇందులో నా బలవంతం ఏమీ లేదు . . . కాని నవీన్ ఆత్మ శాంతించాలని నీవు, నేను కోరితే . . . అదొక్కటేమార్గం . . . ఎంతకన్న నేనేమీ చేయలేను . . . నీ ఇష్టం."

"అనవసరంగా మీ హృదయాన్ని గాయపరిచాను. నన్ను మన్నించండి . . . మీ విశాలహృదయం, మీ సానుభూతి . . . నన్ను . . . నన్ను . . ."

"శ్యామలా, అయితే నీవు అంగీకరించినట్టేనా? . . . నాతో కలిసి నీ జీవితం గడుపుతావు . . . అవునా? . . ."

శ్యామల మౌనంగా తల ఆడించింది.

విజయ్ ఆనందం పరుగులు తీసింది.

"నవీన్, నీ కోరిక తీరింది . . . నీ శ్యామల ఇకమీదట నా శ్యామల కాబోతూంది . . ." అని నవీన్ ఫోటో దగ్గరికి వెళ్లి నమస్కరించాడు.

శ్యామల విజయ్ దగ్గరగా వెళ్లి నిలబడింది.

"శ్యామా . . ."

"ఆఁ . . ."

"నీ హృదయం ఎంత ఉన్నతం! . . . నా జన్మ తరించింది. నిజంగా నేను భాగ్యవంతుడను . . ."

"అలా అనకండి" అంటూ అతని పాదాల నంటింది.

* * *

విజయ్ శ్యామలల వివాహం రిజిస్ట్రార్ సమక్షంలో అతి సాధారణంగా జరిగిపోయింది. ఇప్పుడు శ్యామలా నవీన్ శ్యామలా విజయ్ అయింది. విజయ్ మనసంతా శ్యామలపట్ల జాలితో నిండిపోయింది. తన జీవం ఉండేవరకు శ్యామలను సుఖపెట్టదలిచాడు.

(ముగింపు వచ్చే సంచికలో)